

గోదాదేవి అష్టోత్తర శతనామావళి

గోదావరిఖనిటౌన్: కోదండ రామాలయంలో అండాళ్(గోదాదేవి) తిరు నక్షత్రం సందర్భంగా శనివారం శ్రీగోదా అష్టోత్తర శతనామావళి, ఒడి బియ్యం సమర్పణ నిర్వహించారు.



కార్మికుల వినూత్న నిరసన

పెద్దపల్లిరూరల్: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం గడ్డి, ఆకులు తింటూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గ్రామాభివృద్ధిలో నిర్లక్ష్యం చేయొద్దు



ప్రకృతి వనం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాభివృద్ధిలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రియాంక అన్నారు. శనివారం సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి, బొంతకుంటపల్లి గ్రామాలను సందర్శించారు. మండలంలో నాలుగేళ్లు పూర్తి చేసుకొని రెగ్యులరైజ్ కోసం ఎదురుచూస్తున్న కార్యదర్శుల పనితీరును తెలుసుకునేందుకు పల్లె ప్రకృతివనం, శ్మశానవాటికలు, సెగ్రిగేషన్ షెడ్లు, గురుకుల పాఠశాలలను పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేసి గ్రామాభివృద్ధికి ఎప్పటికప్పుడు ప్రణాళికలు రూపొందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వీరగోని సుజాత, డీపీవో చంద్రమౌళి, జిల్లా అటవీశాఖ అధికారి శివయ్య, ఎంపీడీవో శశికళ, ఎంపీటీసీ అనూష, ఉప సర్పంచ్ మధు, కార్యదర్శి ప్రశాంత్, పీఆర్ ఏఈ సతీశ్, ఏపీడీ సత్యనారాయణ, ఏపీవో లావణ్య, ఏపీఎం గీత, మాజీ సింగిల్‌విండో చైర్మన్ వీరగోని రమేశ్, మాజీ ఎంపీటీసీ పులి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

మంథని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్‌గా శ్రీధర్‌రెడ్డి



శ్రీధర్‌రెడ్డి

కమాన్‌పూర్(మంథని): మంథని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చెరుకు శ్రీధర్‌రెడ్డిని నియమిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన విష్ణువర్ధన్ హైదరాబాద్‌లోని యూనివర్సిటీకి బదిలీ అయ్యారు. ఇక్కడ వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఔట్‌ఫ్లో



గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్న వరద నీరు

రామగుండం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీ వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఇప్పటికే పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 1.95 లక్షల ఇన్‌ఫ్లో వస్తుండగా, 26 గేట్లు ఎత్తి ఔట్‌ఫ్లో 2.55 లక్షల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.



కండువాలు మారుస్తున్రు!

అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు

> 'జిల్లాలో ఓ పార్టీ సోషల్‌మీడియా విభాగంలో పనిచేసే నేత పార్టీ మారి కండువా మార్చిండు. తీరా మరుసటి రోజే సొంతగూటికి చేరి మళ్లీ పాత కండువా కప్పుకున్నాడు. మరికొందరు వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో పోటీచేయాలనుకునే నేతలు పది, ఇరవై మంది కార్యకర్తలను తీసుకొచ్చి తమ నేతతో కండువా కప్పించి వారిని ప్రసన్నం చేసుకునేందుకు పాట్లు పడుతున్నారు. మరుసటి రోజు వారే మరో నేత అనుచరులుగా మరో పార్టీ జెండా కప్పుకుంటున్నారు.'

> 'జిల్లాలో ఓ పార్టీ ద్వారా ప్రజాప్రతినిధిగా ఎన్నికైన నాయకుడు ఉదయం తమ ప్రజాప్రతినిధి విధివిధానాలు నచ్చలేదంటూ పార్టీకి రాజీనామా చేశాడు. సాయంత్రంకు చర్చలు ఫలించటంతో పార్టీలోనే కొనసాగుతున్నానని ప్రకటించాడు. మరో నియోజకవర్గంలో ఓ నేత తనకు అడిగిన పదవి ఇవ్వలేదని పార్టీకి గుడ్‌బై చెప్పుతున్నానని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. తర్వాత జరిగిన చర్చలతో పార్టీలోనే కొనసాగుతున్నట్లు ప్రకటించాడు.'

- జిల్లాలో ఊపందుకున్న జంపింగ్‌లు
- జెండాలు మారుస్తున్న ద్వితీయశ్రేణి నేతలు
- నాయకుల స్థాయిని బట్టి ప్యాకేజీలు
- మరికొందరు పార్టీమారుతామంటూ లీకేజీలతో 'క్యాష్' చేసుకుంటున్న వైనం

సాక్షి, పెద్దపల్లి: 'ఈ గట్టునుంటావా.. ఆగట్టునుంటావా' అన్నట్లుగా జిల్లాలో జంప్‌జిలానీల సీజన్ నడుస్తోంది. ముఖ్యంగా పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గంలో ఈ గోడ దూకడాలు జోరుగా సాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొలది పార్టీల్లో జంపింగ్‌లు ఊపందుకుంటున్నాయి. ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు అన్నట్లు పార్టీలు మారిపోతున్నారు. సాధారణ కార్యకర్త మొదలు కీలక నేతలు దాకా కండువాలు మార్చేస్తున్నారు. ఉన్న వారిని కాపాడుకోవడం, ఇతర పార్టీల వారికి గాలం వేయడం, వదిలి వెళ్లిన వారిని మళ్లీ సొంతగూటికి తెచ్చుకోవడం లక్ష్యంగా వ్యూహాలను అమలు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తుండగా.. బీజేపీ, బీఎస్పీ మాత్రం కాస్త వెనుకబడిందనే విధంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో తమ పలుకుబడిని, ప్రాబల్యాన్ని నిరూపించుకునేందుకు నేతలు చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఇదే అదునుగా కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు దీనిని 'క్యాష్' చేసుకుంటున్నారు. మరికొందరు పార్టీ మారుతున్నమంటూ సిగ్నల్స్ ఇస్తూ నేతల నుంచి ఆర్థికంగా లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తున్నారు.

ప్యాకేజీలు.. ప్రలోభాలు.. కేసులు

రాజకీయ పార్టీలు మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, స్థానికంగా పట్టు ఉన్న నాయకులను రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు నజరానా లేదా పనులు ఇచ్చి వలసలను ప్రోత్సహిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. మరికొందరు నాయకులు తమ బలగాన్ని పెంచుకునేందుకు సామవేద దండోపాయాలను అమలు పెడుతున్నారు. పాత కేసులు బయటకు తీస్తారని, వ్యాపార లావాదేవీల దృష్ట్యా, మరికొందరు పదవులు రాక, అలిగి పార్టీలు మారుతున్నారు. భయంతో ఉదయం పార్టీ మారిన వారు సాయంత్రం వరకు తిరిగి సొంతగూటికి చేరుతున్నారు. ఎన్నికలకు ఇంకా నాలుగైదు నెలలు ఉండగానే పరిస్థితి ఇట్లా ఉంటే ఎన్నికల నోటిఫికేషన్ నాటికి ఏ నాయకుడు ఏ పార్టీలో ఉంటడో తెలియని పరిస్థితి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

బల్దియాలో కదలని శానిటేషన్ వాహనాలు

- కార్మికులకు అందని వేతనాలు
- విధులకు హాజరుకాని 21 మంది కార్మికులు
- కంపాక్టర్లు నడవక పేరుకుపోతున్న చెత్త
- చోద్యం చూస్తున్న అధికారులు, పాలకులు



చెట్ల కింద పార్కింగ్ చేసి ఉన్న ట్రాక్ మౌంటెడ్ గార్బేజ్ కంపాక్టర్ వాహనం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని శానిటేషన్ విభాగంకు రూ.7.12కోట్ల నిధులు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాల్లో చెత్తను తొలగించాల్సిన కీలక వాహనాలను అధికారులు వారం రోజులుగా ఉపయోగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. బల్దియా కార్యాలయంలోనే పార్కింగ్ చేసి చేతులు దుల్పుకున్నారు. టీఎస్ ఆగ్రోస్ ద్వారా కొనుగోలు చేసిన పలు వాహనాలపై కార్మికులు విధులకు హాజరుకావడం లేదు. దీంతో వారం రోజులుగా చెత్త తొలగించే ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఒకవైపు భారీ వర్షాల నేపథ్యంలో సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు, పాలకులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పేరుకుపోతున్న చెత్తతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు నెలలుగా నిలిచిన వేతనాలు

టీఎస్ ఆగ్రోస్ ద్వారా కొనుగోలు చేసిన పలు శానిటేషన్ వాహనాలపై 21 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఇందులో ఏడుగురు డ్రైవర్లు, 14 మంది అసిస్టెంట్లు. వీరందరికీ నాలుగు నెలలుగా వేతనాలు మంజూరు కావడం లేదని ఆరోపిస్తున్నారు. కార్మికుల వేతనాల చెల్లింపుకు ఇటీవల కౌన్సిల్ ఆమోదం పొందినప్పటికీ అధికారులు వేతనాలు మంజూరు చేయడంలో జాప్యంచేస్తుండటంతో విసిగిపోయి వారం రోజులుగా విధులకు హాజరు కావడం లేదని తెలుస్తోంది. దీంతో పారిశుద్ధ్యం విభాగంలోని కీలక వాహనాలన్నీ ఆగిపోయాయి.

నిలిచిన రెండు కంపాక్టర్ వాహనాలు

సుమారు రూ.90 లక్షల విలువ చేసే రెండు ట్రాక్ మౌంటెడ్ గార్బేజ్ కంపాక్టర్ వాహనాన్ని కొనుగోలు చేశారు. వారం రోజులుగా కార్మికులు విధులకు హాజరుకాకపోవడంతో ఈ రెండు వాహనాలను బల్దియా కార్యాలయంలోని చెట్ల కింద పార్కింగ్ చేసి వదిలేశారు.

అలంకార ప్రాయంగా జెట్టింగ్ మిషన్

బల్దియాలో మురుగు నీటి లీకేజీలు చోటు చేసుకోకుండా తక్షణం మ్యాన్‌హోళ్లపై చర్యలు తీసుకోవడానికి రూ.40లక్షల పైచిలుకు నిధులతో కొనుగోలు చేసిన జెట్టింగ్ మిషన్ అలంకార ప్రాయంగా మారింది. వీటిని నడపటానికి కార్మికులు అందుబాటులో, లేకపోవడంతో వాహనాన్ని చెట్ల కింద పార్కింగ్‌చేసి వదిలేశారు. చాలా చోట్ల మ్యాన్‌హోళ్లు నిండిపోయి మురుగునీరు రోడ్లపై పొంగి పొర్లుతున్నాయి. ఫిర్యాదులు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కీలక అధికారులు లేక పాలన అస్తవ్యస్తం

బల్దియాలో కీలక అధికారులు లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. కమిషనర్ సుమన్‌రావు బదిలీపై బడంగ్‌పేట్‌కు బదిలీపై వెళ్లారు. సుమన్‌రావు స్థానంలో సీహెచ్.నాగేశ్వర్‌ను ఈనెల 15న ప్రభుత్వం బదిలీ చేసింది. ఇప్పటికీ కొత్త కమిషనర్ విధుల్లో చేరలేదు. అలాగే రామగుండంకు బదిలీ అయిన డిప్యూటీ కమిషనర్ ఆర్.త్రయంబకేశ్వర్‌రావు కూడా విధుల్లో చేరలేదు. సెలవుల్లో ఉన్న ఎస్ఈ చిన్నారావు అధికారి, డీఈ మాధవి, ఇద్దరు ఏఈలు కూడా విధుల్లో చేరలేదు.

కలెక్టరేట్‌లో కలియ తిరిగిన కలెక్టర్

- పలు ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ
- ఉద్యోగుల సమస్యలపై ఆరా
- క్యాంటీన్ ఏర్పాటుకు ఆదేశాలు
- ఆఫీసుల్లో ఫైలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి



కార్యాలయాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో వసతులెలా ఉన్నాయ్.. ఇబ్బందులేమైన ఉన్నాయా.. అంటూ పలు శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ కలియ తిరిగారు. పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. ఉద్యోగులు కార్యాలయ గదుల్లో ఇబ్బందిపడుతూ లంచ్ చేయడాన్ని గమనించి మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా మూడు రోజుల్లో పురుషులకు, మహిళలకు వేర్వేరుగా లంచ్‌రూమ్‌లను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. క్యాంటీన్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏఓ శ్రీనివాస్‌ను ఆదేశించారు. డయాగ్నస్టిక్ హబ్ ద్వారా కలెక్టరేట్‌లోని ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తిస్థాయిలో ఆరోగ్య పరీక్షలు చేయించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రమోద్‌కుమార్‌కు సూచించారు. కలెక్టరేట్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ఓపెన్ కారిడార్‌లో కుండీల్లో ఆకర్షణీయమైన పూల మొక్కలు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన చైల్డ్‌కేర్ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్, ఆయాను ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్‌కు ఆదేశాలిచ్చారు. ఆఫీసుల్లో ఫైలింగ్ విధానాన్ని పకడ్బందీగా చేయాలని, ఫైలింగ్ సమయంలో భద్రత ప్రమాణాలు పాటించాలని అన్నారు. అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని సూచించారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ తదితర శాఖల అధికారులున్నారు.

'కాంగ్రెస్ పార్టీ పోరాటంతోనే దిగొచ్చిన సర్కార్'



ఆకెనపల్లి సబ్‌స్టేషన్‌ను సందర్శించి మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్ ఠాకూర్

రామగుండం: కాంగ్రెస్ పార్టీ కరెంట్ పోరాటంతోనే సర్కార్ దిగొచ్చి 20 గంటలకు పైబడి విద్యుత్ సరఫరా చేస్తోందని, ఇందుకు కారణం ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో విద్యుత్ వినియోగం తగ్గి నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్ అన్నారు. శనివారం అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి సబ్‌స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ సరఫరా లాగ్ బుక్‌ను పరిశీలించారు. ప్రతీ రైతుకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరంగా ఎనిమిది గంటలు సరఫరా చేస్తే సరిపోతుందని, నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నా రైతు వినియోగించుకునేది ఎనిమిది గంటలేనని తెలిపారు. రైతు వేదికలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహించడం పట్ల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శిస్తోందని అన్నారు. సమావేశంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, కాంగ్రెస్ ప్రతినిధులు ఉరిమెట్ల రాజలింగం, సింగం కిరణ్‌కుమార్ గౌడ్, గుంట బాపు, మద్ది తిరుపతిగౌడ్, ఆవుల గోపాల్ యాదవ్, బర్పటి శ్రీనివాస్ తదితరులున్నారు.

పారిశుధ్య కార్మికుల దీక్షలపై స్పందించాలి

పంచాయతీ పారిశుధ్య కార్మికుల రిలే దీక్షలపై ప్రభుత్వం స్పందించాలని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ డిమాండ్ చేశారు. శనివారం అంతర్గాంలో పారిశుధ్య కార్మికులు చేపడుతున్న రిలే దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. పక్షం రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో గ్రామాలు అపరిశుభ్రతతో గ్రామీణ ప్రజలకు అంటువ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉందన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల చర్చలు వాయిదా



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంపై శనివారం యాజమాన్యం ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టర్ల సమక్షంలో జరిగిన చర్చలు వాయిదా పడ్డాయి. చర్చల్లో పాత వేతన ఒప్పందంలోని ప్రధాన డిమాండ్స్ పదోన్నతులకు ఎంతమంది కార్మికులు అర్హత ఉన్నారో తెలియజేయడం, వారసత్వ ఉద్యోగాల కల్పన వేగవంతం, ప్రమాదంలో మృతి చెందిన క్రమంలో రూ.25 లక్షలు, సాధారణంగా విధి నిర్వహణలో మృతి చెందితే రూ.15 లక్షలు, బయట సాధారణంగా మృతి చెందితే రూ.5 లక్షలు వచ్చేలా ఒప్పందం చేసుకోవాలని చర్చించారు. యాజమాన్యం ప్రతినిధులు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు మానివేయాలని సూచించగా మళ్లీ చర్చలు జరిగేంతవరకు ప్రతి రోజూ షిఫ్టుల వారీగా 30 నిమిషాలు నిరసన కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఈనెల 28వ తేదీ లోపు పాత వేతన ఒప్పందంలోని పెండింగ్ అంశాలను పూర్తిచేసేందుకు అంగీకారంతో పాటు ఆర్థికపరమైన అంశాలకు సంబంధించిన విషయాలను చర్చించేందుకు ఏజీఎం(హెచ్‌ఆర్) అధికారి సెలవులో ఉన్నందున తిరిగి చర్చలను ఈనెల 29కి వాయిదా వేశారు. చర్చల్లో ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి, ఎన్సీసీ సభ్యులు బాబర్ సలీంపాషా, కౌశిక హరి, ఉపేందర్, స్వామి, శంకర్, చందర్, భూమయ్య, శ్రీనివాస్, రాజమల్లయ్య, యాజమాన్యం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

24న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రవేశాలకు ఎంపిక

పెద్దపల్లిరూరల్: బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు ఈనెల 24న లాటరీ పద్ధతిన ఎంపిక ఉంటుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్–నాన్ రెసిడెన్షియల్) కింద పాఠశాలల్లో ఒకటో తరగతి (నాన్ రెసిడెన్షియల్)లో 70 సీట్లు, 5వ తరగతి (రెసిడెన్షియల్)లో 73 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. రిజర్వేషన్ ప్రకారం విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 24న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌కు హాజరుకావాలని కోరారు.

బాహుబలి గని

- వకీల్‌పల్లి, ఓసీపీ–1,2, ఏఎల్‌పీ కలుపుకుని నూతన ఓసీపీ
- ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి
- వడివడిగా మెగా రామగుండం కోల్‌మైన్

గోదావరిఖని: రాబోయే రోజుల్లో వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా యాజమాన్యం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. ప్రసుత్తం 78 మిలియన్ టన్నుల లక్ష్యంగా ముందుకు సాగుతుండగా, రాబోయే రోజుల్లో మరో 22మిలియన్ టన్నులు పెంచేందుకు నిర్ణయించింది. దీనిలో భాగంగా ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే మరో భారీ ఓపెన్‌కాస్ట్ ఏర్పాటుకు వడివడిగా ముందుకు సాగుతోంది. నాలుగు గనులు కలిపి రామగుండం కోల్‌మైన్ పేరుతో కొత్త ఓసీపీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 633.45మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్న ఈ ప్రాజెక్టు రెండేళ్లలో ప్రారంభమయ్యేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

ఆర్జీ–3ఏరియాకు అనుబంధంగా..

సింగరేణి సంస్థ రామగుండం రీజియన్‌లోని ఆర్జీ–3 ఏరియాకు అనుబంధంగా రామగుండం కోల్‌మైన్ ప్రాజెక్టు ఏర్పాటు కాబోతోంది. భవిష్యత్‌లో అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును కలుపుకుని ఆర్జీ–2 ఏరియాలోని వకీల్‌పల్లి గని, ఆర్జీ–3 ఏరియాలోని ఓపెన్‌కాస్ట్–1, 2, మూసివేసిన జీడీకే–10 గనిని కలుపుకుని మెగా ప్రాజెక్టు ఏర్పాటుకు సిద్ధమైంది. ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు ఆర్జీ–2, 3 జీఎంలతో ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరుపుతున్నారు. రెండు ఏరియాల అధికారులతో కోఆర్డినేషన్ చేసుకుంటూ ప్రాజెక్టు పనులు సిద్ధం చేసేందుకు ప్రత్యేక అధికారిని యాజమాన్యం నియమించింది.



ఓసీపీ-1 ప్రాజెక్టు

పెరుగనున్న బొగ్గు ఉత్పత్తి

రామగుండం కోల్‌మైన్ ప్రాజెక్టు ఏర్పాటుతో ఏటా 10మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి పెరగనుంది. ప్రస్తుతం విడివిడిగా ఉత్పత్తి కొనసాగిస్తున్నప్పటికీ కాలానుగుణంగా అన్ని గనులను ఒకే ఓసీపీ కిందకు తీసుకరానున్నారు. నూతన మెగా ఓసీపీ మూలంగా వకీల్‌పల్లి గనిని మరో రెండేళ్లలో మూసివేయనున్నారు. ఇప్పటికే మూసివేసిన జీడీకే–10గనితో పాటు నాలుగు గనులను ఒకే ప్రాజెక్టు పరిధిలోకి తీసుకరానున్నారు. దీనివల్ల సరిహద్దు సమస్య లేకుండా ఉండనుంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఓసీపీ–2 ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూసేకరణ, ఎస్ఆర్ఎస్పీ కెనాల్ మార్పు తదితర పనుల మూలంగా ఉత్పత్తి వెనకపడింది. ఇదే ప్రాజెక్టు పరిధిలో ఉన్న అడ్రియాల లాంగ్ ప్రాజెక్టు గని కూడా ఇందులో అంతర్భాగంగా కొనసాగించనున్నారు.

రెమిడేషన్ ప్లాన్‌లో వకీల్‌పల్లి, ఓసీపీ–1

పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించి అధిక ఉత్పత్తి తీసిన వకీల్‌పల్లిగని, ఓసీపీ–1 ప్రాజెక్టు ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ కోసం రెమిడేషన్ ప్లాన్ చేయాల్సింది ఉంది. ఈ మేరకు రెండు గనుల అధికారులు సమీప గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇవి పూర్తయితే రెండు గనులకు సంబంధించిన ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ వస్తుంది. క్లియరెన్స్ రాగానే రామగుండం కోల్‌మైన్ ఓసీపీ కోసం యాజమాన్యం ఎన్విరాన్‌మెంట్ విభాగానికి దరఖాస్తు చేసుకోనుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈఏడాది నవంబర్‌లో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించే అవకాశాలున్నాయి. 2024 నాటికి నాలుగు గనుల సరిహద్దు కలిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రాజెక్టు ప్రొఫైల్:

ప్రాజెక్టు పేరు: రామగుండం కోల్‌మైన్
విస్తరణ: 3445హెక్టార్లు
బొగ్గు నిల్వలు: 633.45మిలియన్ టన్నులు
ఏటా బొగ్గు ఉత్పత్తి: 14మిలియన్ టన్నులు(భూగర్భగనితో కలిపి)
ఓవర్‌బర్డెన్: 2,846 మిలియన్ క్యూబిక్‌మీటర్లు
ప్రాజెక్టు జీవిత కాలం: సుమారు 30ఏళ్లు
అటవీభూమి: 719హెక్టార్లు

క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రామగిరి మండలాల పరిధిలోని సిద్దిపల్లెకు చెందిన కర్రు వెంకటిఇ, బిల్లా భూమయ్య, రామయ్యపల్లెకు చెందిన లింగన్నపేట మొగిలి, ఎంజాల కనుకమ్మ, బావు ఓదెలు, బావు వెంకటమ్మలు ఇటీవల మృతి చెందగా.. వారి కుటుంబాలను శనివారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రవీందర్, సర్పంచ్ తాటికొండ శంకర్, నాయకులు పూదరి సత్యనారాయణగౌడ్, మ్యాదరబోయిన కుమార్, రాసకొండ రవి, శ్రీనివాస్, తదితరులున్నారు.

ఖనిలో 6జర్నీ సినిమా చిత్రీకరణ



సినిమా సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

గోదావరిఖనిటౌన్: అరుణ కుమారి ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 6జర్నీ సినిమా సన్నివేశాలను శనివారం గోదావరిఖని పట్టణ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. చిత్రానికి ప్రొడ్యూసర్ పాళ్యం రవిప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్‌గా బషీర్ ఆలూరి, కెమెరామెన్‌గా సురేందర్‌రెడ్డి ఉన్నారు. హీరోగా సమీర్‌రెడ్డి నటిస్తుండగా, నటీనటులు సోయల్, సాహితీ, పల్లవితో పాటు స్థానిక కళాకారులు దామెర రాజేశ్, దయా నర్సింగ్, మూల శంకర్, తిరుపతిగౌడ్, రహీం, దామెర శంకర్, స్వప్న ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ఎద్దు మృతి



మృత్యువాత పడిన ఎద్దు

మంథని: మంథని మండలం నాగారంలో కొడారి కొమురయ్యకు చెందిన ఎద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృత్యువాత పడింది. శనివారం అటువైపుగా మేతకు వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎద్దు తోక తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉండడంతో ప్రమాదం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల కన్నాల గ్రామానికి చెందిన శంకర్ విద్యుత్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

జ్యోతినగర్/కోల్‌సిటీ(రామగుండం): వర్షాకాలంలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శనివారం రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ న్యూపోరట్‌పల్లి నుంచి మేడిపల్లి గ్రామ రైతు వేదిక వరకు రెండు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి వరద కాలువను పరిశీలించారు. న్యూపోరట్‌పల్లిలో గతేడాది బ్యాక్‌వాటర్‌తో నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నీటి ప్రవాహాలు రాకుండా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని, మున్సిపల్ అధికారులు పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, తహసీల్దార్ జాహేద్‌పాషా, మున్సిపల్ శానిటేషన్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని, పిచ్చి మొక్కలు, చెత్తను వెంటనే తొలగించాలని కలెక్టర్ అన్నారు. వారం రోజుల్లో మరోసారి పర్యటిస్తానని, పరిశుధ్య పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఈఈ హాజరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యం మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు.

కాఫీ సెంటర్ ప్రారంభం

మార్కండేయ కాలనీలో దళితబంధు లబ్ధిదారుడి మద్రాస్ కాఫీ సెంటర్‌ను కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం ప్రారంభించారు.

బీజేపీ పాలనలో భద్రత లేదు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: కేంద్రంలో బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చాక దేశ ప్రజలకు భద్రత కరువైందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్నా ప్రధాని నరేంద్రమోదీ, హోం శాఖ మంత్రి అమిత్‌షా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేశరక్షణ కోసం పని చేసిన సైనికుడు తన కుటుంబాన్ని రక్షించుకునే పరిస్థితి లేదని అన్నారు. మణిపూర్ ప్రజలకు సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆర్టీసీని పరిరక్షించుకోవాలని, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, యూనియన్లు లేకపోవడంతో కార్మికుల హక్కులు హరించబడుతున్నాయన్నారు. ఆర్టీసీని పరిరక్షించాలని అన్ని డిపోల వద్ద అఖిల పక్షపార్టీలు, ప్రజాసంఘాలు, కార్మికుల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, కొయ్యడ సృజన్ కుమార్, అందె స్వామి, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బత్తుల బాబు, బండ రాజిరెడ్డి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు దూరంగా ఉండలేక..

- విద్యార్థిని ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి



సంకీర్తన (ఫైల్)

ధర్మారం: ఉన్నత చదువులు చదివించాలనే తల్లిదండ్రుల తపన.. చదువు కోసం తల్లిదండ్రులకు దూరంగా ఉండలేక తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిలావనపర్తికి చెందిన కనుకట్ల కమల్-రేఖ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు సంకీర్తన జూలపల్లి మండలం తెలుకుంట కస్తూర్బా గాంధీ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. వేసవి సెలవుల్లో ఇంట్లో ఉన్న సంకీర్తనను పాఠశాలలు ప్రారంభమైన తర్వాత తల్లిదండ్రులు కస్తూరిబా విద్యాలయానికి వెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులను వదిలి వెళ్లలేక కొంత సమయం తీసుకుంది. అయితే ఈనెల 15న రేపు విద్యాలయానికి తీసుకెళ్తానని, వస్తువులు సర్దుకోవాలని కూతురు సంకీర్తనకు తండ్రి కమల్ చెప్పి రైస్‌మిల్లులో పనిచేసేందుకు వెళ్లాడు. తల్లిదండ్రులకు దూరంగా ఉండటం ఇష్టం లేక మానసిక వేదనకు గురై ఇంట్లో రేకుల షెడ్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యయత్నంకు పాల్పడింది. గమనించిన స్థానికులు వెంటనే తండ్రికి సమాచారం అందించి పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి కమల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

తగ్గిన వరద.. తప్పిన ముప్పు



మంథని వద్ద తగ్గుతున్న గోదావరి

మంథని: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు ప్రాజెక్టుల్లోని వరద ఉధృతి కాస్త నెమ్మదించడంతో గోదావరి, మానేరు పరీవాహక ప్రాంతాలకు వరద ముప్పు తప్పిందని ఊరట ప్రజల్లో వ్యక్తమవుతోంది. శుక్రవారం నాటి పరిస్థితులు ఆందోళన కలిగించగా శనివారం మంథని వద్ద గోదావరి, మానేరులో ప్రవాహం తగ్గడంతో ఈ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీలో 60 గేట్లు ఎత్తి రెండు లక్షల 62500 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. బారేజీ సామర్థ్యం 130 మీటర్లు కాగా 122.12 నిల్వ కొనసాగిస్తూ కిందకు నీటిని వదులుతున్నారు.

25న ఓదెల మల్లన్న హుండీ ఆదాయం లెక్కింపు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని ఈనెల 25న లెక్కిస్తున్నట్లు ఈవో సదయ్య తెలిపారు. అలాగే దేవుని ఫొటోలు, వంటపాత్రలు అమ్ముకునేందుకు హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని అన్నారు. ఔత్సాహికులు పాల్గొనాలని కోరారు.

మహిళపై లైంగిక దాడి

ఎలిగేడు: ఎలిగేడు మండలం లాలపల్లికి చెందిన న్యాతరి రామయ్య అదే గ్రామానికి చెందిన ఓ అవివాహిత మహిళపై ఈనెల 14న లైంగిక దాడికి పాల్పడినట్లు జూలపల్లి పోలీసులు తెలిపారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

మంథని: మంథని మండలం ఎక్లాస్‌పూర్‌లో మూడు రోజుల క్రితం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక(17) శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలిక మనస్తాపంతో గురువారం పురుగుల మందు తాగగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీజీహెచ్ డాక్టర్స్ గదిలోకి చొరబడిన మహిళ

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని డాక్టర్లు విశ్రాంతి తీసుకునే గదిలోకి శనివారం ఓ గుర్తుతెలియని మహిళ తన చంటి బిడ్డతో చొరబడింది. కొంతకాలంగా వైద్యులు, సిబ్బంది విశ్రాంతి తీసుకుంటున్న గదుల్లోని వారి విలువైన వస్తులు చోరీకి గురవుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి వస్తువులను దొంగలిస్తున్నారని అనుమానిస్తున్నారు. రెండు నెలల క్రితం కూడా రూ.25వేల సెల్‌ఫోన్‌తో పాటు రూ.1,500 నగదు కూడా చోరీ జరిగిందని సిబ్బంది వెల్లడించారు. దీనిపై వైద్య సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈక్రమంలోనే శనివారం ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్ పక్కన డాక్టర్ల విశ్రాంతి కోసం కేటాయించిన గదిలోకి, ఓ గుర్తుతెలియని మహిళ తన చంటి బిడ్డతో అక్రమంగా చొరబడింది. చోరీ చేయడానికే గదిలోకి వెళ్లిందని అనుమానించిన గమనించిన వైద్యులు, సిబ్బంది వెంటనే ఆస్పత్రిలోని ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సదరు మహిళకు కౌన్సెలింగ్ చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా సదరు మహిళ తన బిడ్డకు పాలు ఇవ్వడానికి గదిలోకి వెళ్లినట్లు పొంతలేని సమాధానాలు చెబుతోందని తెలిసింది. ఈ సంఘటన ఆస్పత్రిలో చర్చనీయాంశంగా మారింది. పోలీసులు కౌన్సెలింగ్ చేసి ఆమెను వదిలేసినట్లు సమాచారం.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీవో మధుమోహన్

సుల్తానాబాద్: మానేరు, హుస్సేమియా వాగుల వరదతో రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి మధుమోహన్ అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలను, ప్రజాప్రతినిధులను చైతన్యవంతం చేయడంతో పాటు అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఇంటింటా సర్వే చేయాలి

నూతనంగా ఓటరు నమోదుకు అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటా సర్వే చేయాలని ఆర్డీవో మధుమోహన్ అన్నారు. శనివారం సుల్తానాబాద్‌లో బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నూతన ఓటర్లతో పాటు మార్పులు, చేర్పులు, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం, పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితాతో పాటు రాజకీయ పార్టీలకు సమాచారాన్ని ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ యాకన్న, నాయబ్ తహసీల్దార్ సదానందం, ఆర్ఐలు స్వాతి, శ్రీవాణి, కోటేశ్వర్, సర్వేయర్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలపై జీఎంకు వినతి

గోదావరిఖని: సంస్థ వ్యాప్తంగా ఉన్న సింగరేణి కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆర్జీ–2 జీఎం మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నుంచి కల్చరల్ విభాగాన్ని వేరు చేయాలన్నారు. స్పోర్ట్స్ విభాగానికి ఇచ్చినట్లుగా కల్చరల్ విభాగానికి కూడా వాయిద్య పరికరాలు సమకూర్చాలన్నారు. ఏరియా స్థాయిలో కళాకారుల ప్రత్యేక ఆడిటోరియం నిర్మించాలని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్, కళాకారుల ఎస్‌డీ హమీద్, ప్రమోద్, రామారావు, నీలం రవి ఉన్నారు.

ఏసీపీని కలిసిన సెక్యూరిటీ అధికారి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీరారెడ్డి

గోదావరిఖని: గోదావరిఖని సబ్‌డివిజనల్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన తులా శ్రీనివాసరావును శనివారం ఆర్జీ–1 సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి శనివారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు జె.ఉమేష్, చందా శ్రీనివాస్, తిరుపతి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

నిర్దేశించిన లక్ష్యాలను రక్షణతో సాధించాలి

- ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు



మాట్లాడుతున్న ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు

కమాన్‌పూర్: ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 ఉపరితల గనిలో బొగ్గు ఉత్పత్తి, ఓబీ పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను రక్షణతో సాధించుకోవాలని ఆర్జీ–3 జీఎం కె.సుధాకర్‌రావు అన్నారు. ఓసీపీ–2 ఉపరితల గని వద్ద సంబంధిత అధికారులతో శనివారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు పనులను ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వరద నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు నీటిని తొలగించాలని, బొగ్గు రవాణాకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. గని పురోగతి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఓసీపీ–2 ప్రాజెక్టు అధికారి రాజేందర్, సర్వే అధికారి జైనుల్లా బద్దీన్, ఇంజినీరు నాగరాజు, మేనేజర్ రామారావు, ఐలయ్య, మహేందర్, కోల శ్రీనివాస్‌లతో పాటు ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆగస్టు 25 నుంచి 27 వరకు గోదావరిఖనిలో నిర్వహించనున్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ 16వ కేంద్ర మహాసభలను విజయవతం చేయాలని ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ప్రకాశ్, ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి రాజారత్నం అన్నారు. శనివారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 పంప్ సెక్షన్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ముందుగా ఆగస్టు 16న ఆర్జీ–2 బ్రాంచ్ మహాసభలు నిర్వహిస్తున్నందున ఆర్జీ–2 ఏరియాలోని అన్ని మైన్స్ అండ్ డిపార్ట్‌మెంట్‌లలో నూతన కమిటీలు ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఓసీపీ–3 పంపు సెక్షన్ ఇన్‌చార్జిగా నల్ల శ్రీనివాస్, అసిస్టెంట్ ఇన్‌చార్జిగా శ్రీధర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నారావు, రవీందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



సభ్యులకు సర్టిఫికెట్ అందజేస్తున్న రాజిరెడ్డి

కమాన్‌పూర్: రామగిరి మండలం సెంటినరీకాలనీ సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో శనివారం చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఓసీపీ–1 పీవో రాధాకృష్ణలు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుతుండటం అభినందనీయమని అన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీవైపీఎం ముప్పిడి రవీందర్ రెడ్డి, ఎస్ఎస్‌వో లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ–3ని సందర్శించిన డైరెక్టర్ ఆపరేషన్స్



వ్యూపాయింట్ వద్ద మ్యాప్ పరిశీలిస్తున్న శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3 ప్రాజెక్టు, వకీల్‌పల్లి గనిని డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్‌వీకే శ్రీనివాస్ శనివారం సందర్శించారు. ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో సర్వే మ్యాప్ ద్వారా గని పని స్థలాలను పరిశీలించి 3సీమ్ టాప్ సెక్షన్‌లో కంటిన్యూస్ మైనర్ యొక్క ఉత్పత్తిపై అధికారులతో సమీక్షించారు. అనంతరం గని గనిలోనికి దిగి పని స్థలాలను పరిశీలించారు. వర్షాల వల్ల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడకుండా బొగ్గు ఉత్పత్తి సాధించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించాచు. డైరెక్టర్ వెంట జీఎం మనోహర్, ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, గని మేనేజర్ రవి కిరణ్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి సెక్యూరిటీ అధికారి రాజారెడ్డి, సర్వే అధికారి అఫ్సర్‌పాషా, సంక్షేమాధికారి ఓంకారిబాబు, అధికారులు మధుసూదన్, రమేష్, నర్సింగరావు, ధనుంజయ్ తదితరులున్నారు.

జీడీకే–5 ఓసీపీని సందర్శించిన డైరెక్టర్ పీపీ

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–5 ఓసీపీ గనిని సింగరేణి ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్ రెడ్డి శనివారం సందర్శించారు. వ్యూపాయింట్ ద్వారా ప్రాజెక్టు పరిశీలించి క్వారీలోకి వెళ్లి అండర్ గ్రౌండ్ గ్యాలరీల్లో జరుగుతున్న పనితీరును పరిశీలించారు. భవిష్యత్‌లో చేపట్టవల్సిన ప్రణాళికల గురించి సూచనలు సలహాలు ఇచ్చారు. కోల్‌బెంచ్‌లు, ఫైర్ ఫైటింగ్ విధానం గురించి చర్చించారు. ఉపరితల గని పరిసర ప్రాంతాల్లో దుమ్ము ధూళి లేవకుండా ఎప్పటికప్పుడు వాటర్ స్ప్రెయింగ్ చేయాలని, రక్షణ చర్యలు పాటిస్తూ పనులను చేపట్టాలని సూచించారు. ఆయన వెంట జీఎం చింతల శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, మేనేజర్ రామస్వామి, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, ఇంజినీర్ ఎస్‌వీరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక గర్జన విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ ఆగస్టు 4న నిర్వహించే కార్మిక గర్జన విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు తోకల రమేశ్, గుజ్జుల సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమతో లాభాలు వస్తున్నాయని, లాభాలకు కారకులైన కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. సీఎం కేసీఆర్ హామీ మేరకు కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు గుమ్మడి వెంకన్న అడెపు శంకర్, ఐనుగాల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వాల్‌పోస్టర్ విడుదల చేశారు.

జగిత్యాలలో 'జోయలుక్కాస్'



ప్రదర్శన ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్

- మూడు రోజుల పాటు ఆభరణాల ప్రదర్శన

జగిత్యాల: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆభరణాల వర్తకులైన జోయలుక్కాస్ వారు జగిత్యాలలో ఆభరణాల ప్రదర్శన ప్రారంభించారు. మూడు రోజుల పాటు సాగే ఆభరణాల ప్రదర్శనను మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, జగిత్యాలలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆభరణాల వర్తకులైన జోయలుక్కాస్ వారు ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జోయలుక్కాస్ తెలంగాణ రీజినల్ మేనేజర్ రోబిన్‌తంబి, వినియోగదారులు పాల్గొన్నారు.

అలరించిన 'అల్ఫోర్స్ డాజిల్–2023'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): హన్మకొండలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన 'అల్ఫోర్స్ డాజిల్–2023' అలరించింది. హన్మకొండలోని ఓ ప్రైవేట్ వేడుక మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా జ్ఞాన సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసిన అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.